చివరి దశకు కొనుగోళ్లు



- లక్ష్యం మేరకు కేంద్రాలకు రాని ధాన్యం
- 2,20,745.10 టన్నులు కొనుగోలు
- బయట మార్కెట్‌లో విక్రయించుకున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. అధికారులు నిర్దేశించిన లక్ష్యం కంటే తక్కువగానే కేంద్రాలకు ధాన్యం వచ్చింది. ఇప్పటివరకు 2,20,745 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు రైతుల నుంచి కొనుగోలు చేయగా, ఇంకా 70 వేల నుంచి 90 వేల టన్నుల వరకు ధాన్యం రైతులు విక్రయించే అవకాశాలున్నాయని చెబుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు ఉండగా, తేమ శాతం 17లోపు రాగానే కాంటాలు పెడుతున్నారు. ధాన్యాన్ని కూడా ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ట్రక్ షీట్లను త్వరితగతిన జనరేట్ చేస్తుండడంతో రైతులకు 10 రోజుల్లోపు వారి ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ అవుతున్నాయి. మెజారిటీ రైతులకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకరాగా, అక్కడక్కడ మధ్య దళారులకు, రైస్‌మిల్లులకు కొంత మంది రైతులు విక్రయించుకున్నారు. గడిచిన ఎండాకాలం సీజన్‌లో జిల్లాలో 2 లక్షల ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. తద్వారా 4 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. అందులో 3 లక్షల 50 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ మేరకు జిల్లాలో 311 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా 29,955 మంది రైతుల నుంచి 484 కోట్ల 51లక్షల రూపాయల విలువైన 2,20,745.10 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇందులో దొడ్డు రకం ధాన్యం 2,14,660 టన్నులు కాగా, సన్న రకం ధాన్యం 6,084.28 టన్నులు ఉంది. 22,880 మంది రైతుల ఖాతాల్లో 354 కోట్ల 45 లక్షల రూపాయలు 73 శాతం జమ చేశారు. 85 శాతం ధాన్యానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయగా, 78 శాతం ధాన్యానికి సంబంధించి ట్రక్ చిట్స్ జనరేట్ చేశారు. ఇంకా మిగతా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే ప్రక్రియ కొనసాగుతున్నది. 28 గ్రామాల్లో కేంద్రాలను మూసివేయగా, 283 కేంద్రాల్లో కొనుగోళ్లు సాగుతున్నాయి.

● కోతలు లేకుండా

వరి కొనుగోళ్ల సందర్భంగా కోతలు విధించకుండా అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో ఒక్కో క్వింటాలు ధాన్యానికి 4 నుంచి 8 కిలోల వరకు విధించి కోతలు కేంద్రాల నిర్వాహకులు, రైస్ మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేశారు. ఈ సీజన్‌లో అలాంటి పరిస్థితి లేకుండా ఉండేందుకు అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ పౌర సరఫరాలు, సంబంధిత శాఖాధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించి వరి ధాన్యంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కోతలు విధించినట్లుగా ఫిర్యాదులు వస్తే ఆయా మిల్లులను బ్లాక్ లిస్టులో పెడతామని హెచ్చరించారు. మరోవైపు ఇదే సమయంలో పార్లమెంట్ ఎన్నికలు జరిగినప్పటికీ, ధాన్యం కొనుగోళ్లకు అంతరాయం లేకుండా అదనపు కలెక్టర్, పౌరసరఫరాల శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రతి రోజు నాలుగైదు కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్, ఇతర శాఖల అధికారులు సైతం సందర్శించి ధాన్యం కొనుగోళ్ల గురించి ఆరా తీసి నిర్వాహకులు, మిల్లర్లు కోతలు విధించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే రైతులు ఈ సీజన్‌లో సన్న రకం వరి పంటను రైతులు 20 శాతం సాగు చేశారు. సన్నరకం వరి ధాన్యానికి మొదట్లో డిమాండ్ ఉన్నప్పటికీ, యాసంగి సీజన్ ధాన్యం కావడంతో నూకలు అవుతాయని వ్యాపారులు కొనుగోలు చేయలేదు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించారు. ఈ సీజన్‌లో రెండు, మూడుసార్లు ఆకాల వర్షాలు కురిసి కొంత ధాన్యం తడిసినప్పటికీ, ఆ ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసింది. మరో వారం, పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు ముగియనున్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వారంలో పూర్తి చేయాలి..

- జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్, అదనపు కలెక్టర్

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ వారం రోజులలో పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ కలెక్టరేట్‌లో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 2,20,745.10 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నద్ధంగా ఉందని, వారం రోజుల వ్యవధిలో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. రైస్‌మిల్లుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, రైస్‌మిల్లుల వద్ద ఎటువంటి కోత విధించడానికి వీల్లేదని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ డీఎం, శ్రీకాంత్ రెడ్డి, డీఆర్‌డీఓ రవీందర్, డీఎస్‌ఓ ప్రేమ్ కుమార్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

మంథని నియోజకవర్గంలో తగ్గిన ఓటింగ్

- పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయని 71,949 మంది ఓటర్లు
- ఓటర్లు 2,39,699 మంది.. ఓటు వేసినవారు 1,67,750 మంది

మంథని, మే 15: మంథని నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపలేదు. నియోజకవర్గంలోని 10 మండలాల్లో ఈనెల 13న జరిగిన ఎంపీ ఎన్నికల్లో భారీగా ఓటర్లు పోలింగ్ బూత్‌వైపు కన్నెతి కూడ చూడలేదు. మంథని నియోజకవర్గంలో 2,39,699 మంది ఓటర్లు ఉండగా 1,67,750 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. 71,949 ఓటర్లు ఓటు వేయలేదు. దీంతో 69.98 శాతం మాత్రమే ఓటింగ్ నమోదైంది. దాదాపు ఐదు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 82.93 శాతం ఓటింగ్ నమోదయ్యింది. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల్లో 69.98 శాతం నమోదు కాగా 12.95 శాతం ఓటింగ్ శాతం తగ్గిపోయింది. అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ఓటింగ్ శాతంతో చూస్తే పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో 28 వేల మంది ఓటర్లు ఓటు వేయలేదు. ఎండ వేడితో వృద్ధులు, మహిళలు, మధ్య వయస్సు ఉన్న వారు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. వివిధ రాజకీయ పార్టీలుఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను తరలించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడం, పార్లమెంట్ నియోజకవర్గ పరిధి చాలా విశాలంగా ఉండటంతో వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు సైతం గ్రామాల్లో పర్యటించకపోవడం, అభ్యర్థులు గ్రామాల్లో ఓటర్ల తెలియపోవడం, వారితో ఎలాంటి అనుబంధం లేక పోవడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఆసక్తి చూపనట్లు అందరూ భావిస్తున్నారు. నియోజకవర్గంలోని కమాన్‌పూర్ మండలంలో అత్యధికంగా 81.78శాతం, పలిమెలలో అత్యల్పంగా 47.85 శాతం పోలింగ్ నమోదైంది. భారీగా తగ్గిన ఓటింగ్ శాతం ప్రభావం ఏ రాజకీయ పార్టీ పై ఉంటుందోనని వివిధ పార్టీ నాయకత్వాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



మంథని నియోజకవర్గ మ్యాప్

మండలాల వారిగా పోలింగ్ వివరాలు..

మంథనిలో మండలంలో 57 పోలింగ్ కేంద్రాలు ఉండగా 46,642 మంది ఓటర్లు ఉండగా ఇందులో 33,766 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 72.39 శాతం పోలింగ్ నమోదైంది. ముత్తారం మండలంలో 26 పోలింగ్ కేంద్రాలు ఉండగా 23,293 మంది ఓటర్లు ఉండగా ఇందులో 16,029 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 61.81 శాతం పోలింగ్ నమోదైంది. రామగిరి మండలంలో 47 పోలింగ్ కేంద్రాలు ఉండగా 38,994 మంది ఓటర్లు ఉండగా ఇందులో 23,455 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 60.18 శాతం పోలింగ్ నమోదైంది. కమాన్‌పూర్ మండలంలో 20 పోలింగ్ కేంద్రాలు ఉండగా 18,140 మంది ఓటర్లు ఉండగా ఇందులో 14,832 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 81.76 శాతం పోలింగ్ నమోదైంది.

కాటారం మండలంలో 36 పోలింగ్ కేంద్రాలు ఉండగా 25,099 మంది ఓటర్లు ఉండగా ఇందులో 20,477 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 81.58 శాతం పోలింగ్ నమోదైంది. మల్హర్ మండలంలో 22 పోలింగ్ కేంద్రాలు ఉండగా 20,785 మంది ఓటర్లు ఉండగా ఇందులో 15,511 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 70.16 శాతం పోలింగ్ నమోదైంది. మహాముత్తారం మండలంలో 27పోలింగ్ కేంద్రాలు ఉండగా 21,640 మంది ఓటర్లు ఉండగా ఇందులో 15,277 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 70.60 శాతం పోలింగ్ నమోదైంది. మహదేవపూర్ మండలంలో 34 పోలింగ్ కేంద్రాలు ఉండగా 27,853 మంది ఓటర్లు ఉండగా ఇందులో 18,490 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 66.38 శాతం పోలింగ్ నమోదైంది. పలిమెల మండలంలో 11 పోలింగ్ కేంద్రాలు ఉండగా 9,038 మంది ఓటర్లు ఉండగా ఇందులో 4,325 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 47.85 శాతం పోలింగ్ నమోదైంది. పాలకుర్తి మండలంలో 10 పోలింగ్ కేంద్రాలు ఉండగా 8,235 మంది ఓటర్లు ఉండగా ఇందులో 5,585 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా 67.86 శాతం పోలింగ్ నమోదైంది.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- భారీ వాహనాల్లో తరలింపు - ప్రభుత్వ పనుల కోసమంటూ బ్యానర్లు - అనుమతులు ఇవ్వలేదన్న తహసీల్దార్



అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన లారీ

సుల్తానాబాద్, మే 15: సుల్తానాబాద్ మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి మళ్లీ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఈసారి భారీ వాహనాలను ఉపయోగించి.. ప్రభుత్వ అవసరాల కోసమంటూ.. ఆయా లారీలకు బ్యానర్లు కట్టుకుని మరీ తరలిస్తుండడం విశేషం. అయితే మూడు రోజుల క్రితం ఇలా భారీ వాహనాలకు ప్రభుత్వ అవసరాల కోసం తరలింపు అనే బ్యానర్లు కట్టుకుని వచ్చిన వారు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తుండగా కదంబాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. వాటిని పట్టుకుని అనుమతులు చూపాలని కోరగా, వారి వద్ద ఎలాంటి అనుమతులు లేవని తేలింది. అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తేలిపోయింది. దాంతో స్థానికులు పోలీసులకు, మరోసారి వంద నంబర్‌కు డయల్ చేసి చెప్పడంతో పోలీసులు రావడంతో వారికి అప్పగించారు. ఇలా వారం రోజులుగా కదంబాపూర్ గ్రామం నుంచి భారీ వాహనాల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ వాహనాలు వచ్చేటపుడు బండరాళ్లను తెస్తూ పోయేటపుడు ఇసుకను నింపుకుని పోతున్నారని వారు వివరించారు. దాంతో తమకు అనుమానం వచ్చి కొన్ని వాహనాలు అడ్డుకోగా అవి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాయని,ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నాయని వారు చెప్పారు. అయితే చాలా వాహనాలు ఇసుకను అక్రమం గా తరలిస్తుండగా తమకు మాత్రం మూడు పట్టుబడ్డాయని కొన్నింటిని తప్పించారని చెప్పారు. కాగా వాటిని విడిచిపెట్టమని తమకు పెద్దఎత్తున ఒత్తిడి వచ్చిందని, వదలాలని తమను దబాయించారని వారు చెప్పారు.

ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు..

కదంబాపూర్‌లో గ్రామస్తులు పట్టుకున్న ఇసుక లారీలను పోలీసులు సుల్తానాబాద్ తరలించగా, వాటికి సంబంధించి ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి. పోలీసులు మాత్రం చర్యల కోసం తహసీల్దార్‌కు అప్పగించారు. గతంలో ఎప్పుడు ఎవరూ పట్టుకున్నా కూడా వెంటనే జరిమానాలు విధించడమో లేక కోర్టులో అప్పగించడమో చేసేవారు. కానీ ఈ మూడు లారీలు పట్టుబడి ఐదు రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు వాటిపై ఎలాంటి చర్యలు లేకుండాపోయాయి.

తదుపరి చర్యల కోసం ఆర్డీవోకు నివేదిస్తా..

- మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్

ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీలపై చర్యల కోసం పోలీసులు మాకు నివేదించారు. తదుపరి చర్యల నిమిత్తం ఈ విషయాన్ని పెద్దపల్లి ఆర్డీవోకు నివేదిస్తున్నాను. సుల్తానాబాద్ మండలంలోని ఏ గ్రామం నుంచి కూడా ప్రభుత్వ అవసరాల కోసం మేము ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.

ఎన్‌పీడీసీఎల్‌లో జిల్లాకు ప్రథమ స్థానం

- పెద్దపల్లి ఎస్ఈ సుదర్శన్

పెద్దపల్లి టౌన్, మే 15: పనుల ప్రగతిని దృష్టిలో ఉంచుకొని ఎన్‌పీడీఎల్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రకటించిన ర్యాంకుల్లో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని, ప్రతి ఒక్క సిబ్బంది చిత్తశుద్ధితో కష్టపడి పని చేయడం వల్లనే ఇది సాధ్యమైందని పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం తెలిపారు. బుధవారం కర్నాటి వరుణ్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పెద్దపల్లి సూపరింటెండెంట్ ఇంజనీర్ సుదర్శనం పాల్గొన్నారు. కంపెనీలో ఉన్న 16 సర్కిళ్లలో జిల్లాకు ప్రథమ ర్యాంకు వచ్చినట్లు, అదేవిధంగా అసిస్టెంట్ ఇంజనీర్లలో సైఫుద్దీన్(కాట్నపల్లి) ప్రథమ ర్యాంకు, సబ్ డివిజన్ విభాగంలో సుల్తానాబాద్‌కు రెండవ ర్యాంకు, గోదావరిఖని సబ్ డివిజన్‌కు మూడవ ర్యాంకు, డివిజన్లలో పెద్దపల్లి డివిజన్‌కు రెండవ ర్యాంకు, మంథని డివిజన్‌కు మూడవ ర్యాంకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

ప్రమాదకరంగా వ్యవసాయ బావి



కాపులపల్లిలో రోడ్డు పక్కనే ఉన్న వ్యవసాయ బావి

పెద్దపల్లి రూరల్, మే 15 : మండలంలోని కాపులపల్లి గ్రామంలో రాగినేడు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. గత కొన్నేళ్లుగా ఇదే రహదారిలో ఈ బావిని లోతుగా తవ్వారు. ప్రస్తుతం కాపులపల్లి మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రజలు రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావి ఆనుకొని ఉండటంతో భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం కూలీలు, బాటసారులు, పాల వ్యాపారులు, ప్రజలు, ద్విచక్ర వాహనదారులు, అధికారులు నిరంతరం ఇదే బావి పక్కనే గల దారినుండే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాత్రింబవళ్లు వెళ్లే రైతులకు ప్రాణపాయం పొంచి ఉంది. అధికారులు స్పందించి బావి ఉన్న ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆలయానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించండి

- ఎన్టీపీసీకి బీజేపీ నాయకురాలు సంధ్యారాణి విజ్ఞప్తి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సంధ్యారాణి

జ్యోతినగర్, మే 15 : టీటీఎస్‌లోని గోదావరి భవన్ ఎదురుగా ఉన్న హనుమాన్ ఆలయానికి ఎన్టీపీసీ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని బీజేపీ నాయకురాలు కందు సంధ్యారాణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారులకు సంధ్యారాణి పూజారి సురేష్‌శర్మతో కలిసి వినతి పత్రం అందజేశారు. నాలుగు దశాబ్దాల క్రితం టీటీఎస్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాన్ని నెలకొల్పారని సంధ్యారాణి తెలిపారు. ఈ ప్రాంత భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ ఆలయంలోని ఆంజనేయస్వామిని కొలుస్తారు. గతంలో ఎన్టీపీసీ విద్యుత్ సౌకర్యాన్ని కల్పించినప్పటికీ 2009లో కనెక్షన్‌ను సంస్థ తొలగించిది. నిత్యం అనేక మంది భక్తులు వచ్చే ఈ ఆలయానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని సంధ్యారాణి కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తోట కుమారస్వామి, పైతరి రాజు, సుమంత్, మహేందర్, నవీన్, ఎన్టీపీసీ అధికారులు ప్రవీణ్‌కుమార్ కె చౌదరి, టీవీఎస్ చంద్ర, యుగంధర్‌రావు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మట్టి తరలింపు..

కమాన్‌పూర్, మే 15 : జూలపల్లి గ్రామంలోని చెరువు నుంచి నిబంధనల మేరకు మట్టి తరలింపు జరుగుతోందని మైనింగ్ ఏడీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం చెరువుప్రాంతం నుంచి మట్టి తరలిస్తున్న ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఓ బ్రిక్స్ యాజమాన్యం తీసుకున్న నిబంధనల మేరకే మట్టి తరలింపు జరుగుతోందని, 60 వేల క్యూబిక్ మీటర్లు అనుమతి తీసుకోకగా, ప్రస్తుతం 4 వేల క్యూబిక్ మీటర్లుకు రాయల్టీ కట్టి దీని ప్రకారం మట్టి తరలిస్తున్నారని తెలిపారు.

ప్రేమ వ్యవహారంలో యువకుడిపై దాడి?

కరీంనగర్ క్రైం, మే 15: ప్రేమ వ్యవహారంలో ఒక యువకుడిని కొత్తపల్లి మండలం రేకుర్తి వద్ద కొందరు దాడిచేసి గాయపరిచినట్లు తెలిసింది. రామగుండం ప్రాంతానికి చెందిన యువతీ యువకులు ప్రేమించుకుని వివాహం చేసుకునేందుకు మంగళవారం కరీంనగర్‌కు వచ్చారు. యువతికి సంబంధించిన బంధువులు వారిని వెంబడించి రేకుర్తి వద్ద వారిని అడ్డుకుని యువకుడిపై దాడి చేసి, అతడిని మరో ప్రాంతానికి తీసుకువెళ్లినట్లు తెలిసింది. వరంగల్‌కు చెందిన యువకుడు కొంత కాలంగా రామగుండం ప్రాంతంలోనే ఉంటూ ఆ ప్రాంతంలోని ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకునేందుకు యత్నించగా ఈ ఘటన చోటు చేసుకుందని సమాచారం. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడని తెలిసింది.

ఆకట్టుకున్న చిరుతల రామాయణం

మల్యాల, మే 15: మండలంలోని సర్వాపూర్‌లో సీతారామాంజనేయ భజన మండలి ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న చిరుతల రామాయణము నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శ్రీ భక్త మార్కండేయ నాటక కళా మండలికి చెందిన కళాకారులు ఈ ప్రదర్శన నిర్వహించారు. సర్వా పూర్, బల్వంతాపూర్, కొత్తపల్లి తదితర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నాటక ప్రదర్శనను తిలకించారు.



సర్వాపూర్‌లో కళాకారుల ప్రదర్శన

అసంపూర్తిగా ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

● 10 నెలలు గడిచినా పూర్తికాని వైనం ● దుమ్ము, ధూళితో ఇబ్బందిపడుతున్న ప్రజలు

చిగురుమామిడి, మే 15: మండలంలోని ఉల్లంపల్లి-సుందరగిరి గ్రామానికి సంబంధించిన రోడ్డు పనులు నిలిచిపోయాయి. గ్రామ ప్రజల ఉద్యమాల ఫలితంగా గత ప్రభుత్వం బీటీ రోడ్డు నిర్మాణానికి 2.25 కోట్ల రూపాయలు మంజూరు చేసింది. నాటి ఎమ్మెల్యే గత ఆగస్టులో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అదే రోజు మండలంలోని ముదిమాణిక్యం, రామంచ, ఓగులాపూర్ గ్రామాల రోడ్లకు శంకుస్థాపనలు చేశారు. ఆ గ్రామాల్లో రోడ్డు పనులు పూర్తయ్యాయి. 10 నెలలు గడిచినా రోడ్డు పనులు పూర్తి కాలేదు. రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ కరువైందని, కల్వర్టులు, ఇతర పనులు ఇష్టారాజ్యంగా చేశారనే విమర్శలు వచ్చాయి. సుందరగిరి నుంచి ఉల్లంపల్లి గ్రామం వరకు నామమాత్రంగా ఎర్ర మట్టి పోసి వదిలేసినారనే అరోపణలు ఉన్నాయి. వాహనాల రద్దీ పెరగడంతో దుమ్ము లేచి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. వర్షాలు కురిస్తే పనులు సాగవని, ఆలోపే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



కోతకు గురవుతున్న ఉల్లంపల్లి-సుందరగిరి రోడ్డు

రోడ్డు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం..

- చట్ల తిరుపతి, ఉల్లంపల్లి



మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లడానికి సరైనా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడ్డాం. అనేక అందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం. కాంట్రాక్టరు, అధికారుల నిర్లక్ష్యంతోనే రోడ్డు పనులు నిలిచిపోయాయి. వాహనాల రద్దీ, పెరిగిపోయి దుమ్ముతో అనేక ఇబ్బందులు పడుతున్నాం.

వర్షాలు పడితే రాకపోకలకు ఇబ్బంది

- బునాద్రి సాయిలు, ఉల్లంపల్లి



ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డు సాధించుకున్నాం.. ఆ రోడ్డు పనులను ఇష్టారాజ్యంగా చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం అయితే రాకపోకలు నిలిచి పోతాయి. ఆలోపే పనులు పూర్తి చేయాలి. లేకపోతే ఆందోళనలు చేస్తాం.

త్వరగా పూర్తి చేయాలి

- చీమూర్తి మల్లయ్య, ఉల్లంపల్లి

రోడ్డు పనులు ఎందుకు నిలిచిపోయాయో ఎవరూ చెప్పడం లేదు. వర్షాలు ప్రారంభం అయితే పోసిన మట్టి కొట్టుకుపోతుంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతాయి. ఎన్నో ఆందోళనలు చేసి రోడ్డును సాధించుకున్నాం. ఆ సంతోషం పనుల్లో జాప్యంతో ఆవిరైంది. ఇప్పటికే రోడ్డుపై వేసిన మట్టి లేచిపోతోంది. గ్రామస్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేయాలి.


పిడుగుపాటుకు చింతచెట్టు దగ్ధం

● మూడు రోజులుగా చెలరేగుతున్న మంటలు



పిడుగుపాటుకు దగ్ధమవుతున్న చెట్టు

రామడుగు, మే 15: మండల కేంద్రంలో పిడుగుపాటుతో వంద సంవత్సరాల చింతచెట్టు దగ్ధమైంది.. సోమవారం సాయంత్రం చింతచెట్టుపై పిడుగు పడింది దీంతో చెట్టులో మంటలు చెలరేగాయి. గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు. తిరిగి మంగళవారం మరోసారి ఆ చెట్టులో నుంచి మంటలు చెలరేగగా గ్రామస్థులు ఆరేశారు.. బుధవారం రాత్రి మరోసారి మంటలు ఎగిసిపడి విద్యుత్ తీగలపై పడడంతో రామడుగులో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.. మరోసారి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలు ఆర్పేశారు.



మంటలు ఆర్పివేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పీడీఎస్ బియ్యం పట్టివేత

వెల్గటూర్, మే 15: మండలం లోని రాజక్కపల్లి గ్రామంలో ఓ ఇంటిలో నిలువ ఉంచిన పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు సవిల్ సప్లయిస్ అధికారులు తెలిపారు. పక్కా సమాచారం మేరకు రాజక్కపల్లిలో పల్లపు శ్రీనివాస్ ఇంటిలో నిలువ ఉంచిన సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. బియ్యం ఉన్న గదిని వెంకటేష్ అనే వ్యక్తికి కిరాయికి ఇచ్చినట్లు శ్రీనివాస్ తెలిపారు. వెంకటేష్‌పై కేసు నమోదు చేసి పట్టుబడ్డ బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

రూ. 7,150 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, మే 15: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,150 రూపాయలు పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 95 క్వింటాళ్ల విడి పత్తి, ముగ్గురు రైతులు గోనె సంచుల్లో మూడు క్వింటాళ్లు విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,150, కనిష్ఠ ధర 4,500 రూపాయలు చెల్లించి కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వీర్నపల్లి, మే 15: ధాన్యం కొనుగోళ్లను వేగంగా జరపాలని డీఆర్డీవో శేషాద్రి అన్నారు. వీర్నపల్లి మండలకేంద్రంతో పాటు ఎర్రగడ్డ తండా కొనుగోలు కేంద్రాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ చేసేలా చూడాలన్నారు. ఆయన వెంట డీపీఎం పాపారావు, ఏపీఎం నర్సయ్య, ఐకేపీ సిబ్బంది ఉన్నారు.

బత్తుల భూమయ్య సేవలు చిరస్మరణీయం



బత్తుల భూమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

చొప్పదండి, మే 15: ఉపాధ్యాయుడిగా, ఎంతఊోగా సేవలందించిన బత్తుల భూమయ్య చిరస్మరణీయుడని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం చొప్పదండిలో జరిగిన బత్తుల భూమయ్య సంతాప సభకు ఆయన హాజరై మాట్లాడుతూ భూమయ్య అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు.ఆయన చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ గుండ చంద్రయ్య, ఎంపీపీ చిలుక రవీందర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మాకర్‌రెడ్డి, నాయకులు కట్టికోల శ్రీనివాస్‌రావు, వెన్న రాజమల్లయ్య, కాడె శంకర్, వొల్లాల క్రిష్ణహరి, ధర్మపురి, బుగ్గారం, ఎండపల్లి మండలాలకు చెందిన అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని తరలించాలని రైతుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, మే 15: కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని మల్కపేట రైతులు రోడ్డుపై బైఠాయించి బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. అకాలు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోళ్ల వేగ వంతం చేయాలన్నారు. కొన్న ధాన్యాన్ని తరలించకపోవడంతో కాంటా వేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రాస్తారోకోతో రోడ్డుకిరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విష యం తెలుసుకున్న కోనరావుపేట ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి చేరుకొని రైతులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కోరుట్ల రూరల్, మే 15: మండలంలోని చిన్నమెట్‌పల్లిలో వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వబ్రాహ్మణ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజలను నిర్వహించి అర్చన, అభిషేకం చేశారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పుస్తె మట్టెలతో గ్రామం నుంచి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అర్చకులు స్వామి వారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇంద్రాల లక్ష్మీనారాయణ, రమేష్‌తోపాటు విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు

కోనరావుపేట, మే 15: బ్రిడ్జి నిర్మాణం కోసం ఓ కాంట్రాక్టర్ చెరువు కట్టను ధ్వంసం చేసి అక్రమంగా మట్టిని తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. కోనరావుపేట మండలం మామిడిపల్లి శివారులోని చిన్నన్న పెద్దన్నకుంట నుంచి హన్మాజీపేటలో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణానికి అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టకు వేసిన రివీట్‌మెంటును ధ్వంసం చేసి వాహనాల ద్వారా అక్రమంగా మట్టిని తరలించారు. మట్టిని తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. మట్టిని తరలించేందుకు వాహనాలు వెళ్లడానికి కట్టను తవ్వించి రివిట్‌మెంటును ధ్వంసం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి ధ్వంసం చేసిన కట్టను, రిపీట్‌మెంట్‌ను సదరు కాంట్రాక్టర్ చేత బాగు చేయించాలని కోరుతున్నారు.



మామిడిపల్లిలో చిన్నన్న పెద్దన్న కుంటలో మట్టి తవ్వకాలు

ఘనంగా 'సందల్' ప్రదర్శన

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు ● హాజరైన ప్రభుత్వ విప్ శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సందల్ ఊరేగింపులో గుర్రపు విన్యాసాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామ శివారులోని దర్వేశ్అలీషా ఖాద్రీ గుట్ట దర్గా వద్ద ఉర్సు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని నిర్వహణకర్త అజీజ్ ఇంటి నుంచి 'సందల్' ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్ల నడుమ దర్గా వరకు తీసుకెళ్లారు. గుర్రపు విన్యాసాలు ఆకట్టుకున్నాయి. దర్గా వరకు ప్రదర్శనగా వెళ్లారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. మత గురువులు బోధనలు చేశారు. అనంతరం డిల్లీ, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన రైస్ అనీస్ సబ్రి, రేహన్‌అలీ ఖవాలీ కార్యక్రమాలు అలరించాయి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య, ఎంపీపీ రేణుక, సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, డీసీఆర్‌బీ డీఎస్పీ సర్వర్‌పాషాతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. భక్తులు భారీ సంఖ్యలో తరలి వెళ్లి దర్గా ను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాజన్నసిరిసిల్ల, సిద్ధిపేట, కామారెడ్డి, హైదరాబాద్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్ జిల్లాలతో పాటు డిల్లీ, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మూడో రోజు నరసింహ నవరాత్రోత్సవాలు

పంచోపనిషత్తులతో అభిషేకం, ప్రత్యేక పూజలు



స్వామి వారికి హారతి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, మే 15: ధర్మపురి లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో మూడో రోజు బుధవారం శ్రీ నృసింహ నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వ హించారు. ఉత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామ వేద పండితులు ముత్యా లశర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాస పూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన, పంచోపనిషత్తులచే రుద్రాభి షేకం కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే సామ వేద పారాయణం తో అభిషేక పూజలు, వాస్తు, యోగిని, క్షేత్ర పాలక, నవగ్రహ, సర్వతో భద్ర మండల, స్థాపిత దేవతా పూజ లు, సహస్ర వరుణ, కలశ స్థాపన, స్థాపిత దేవత హోమాలు నిర్వహించారు. దేశంలో దుర్భిక్ష నివారణ కోసం, సువృష్టి ప్రాప్తికై, సకల ఈతి బాధల నివారణ, అనువాహక హోమాలు నిర్వహించారు. సాయంత్రం కలశ పూజలు, అర్చనాది ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లోక కల్యాణార్థం సుదర్శన, నారసింహ హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు స్వామి వారిని దర్శనం చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసా చారి, చిలుకుముక్కు రమణాచార్యా, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నంబి అరుణ్‌కుమార్, వంశీకృష్ణ, నవీన్ పాల్గొన్నారు.



కళశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో మునిగి ఇంటర్ విద్యార్థి దుర్మరణం

ఓదెల, మే 15: ఈత సరదా ఓ విద్యార్థి ప్రాణం తీసింది. మండలంలోని జీలకుంటలో బుధవారం దొడ్డేపల్లి అరవింద్ (20) అనే ఇంటర్ విద్యార్థి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో నీటమునిగి మృతిచెందాడు. గ్రామస్థులు కుటుంబ సభ్యులు తెలిపిన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అరవింద్ మిత్రులతో కలిసి గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలోకి ఈత నేర్చుకుంటున్నాడు. ఈక్రమంలో బుధవారం బావిలో దిగగా ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి తెలిపారు.

వడ దెబ్బతో గొర్రెల కాపరి మృతి

కోరుట్ల రూరల్, మే 15 : మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన బూరుగుల భూమయ్య (62) అనే గొర్రెల కాపరి వడ దెబ్బతో మృతి చెందినట్లు గ్రామస్థులు బుధవారం తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... భూమయ్య మంగళవారం గొర్రెలు, మేకలను మేపడానికి తీసుకెళ్లి సాయత్రం ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి చేరుకున్న కాసేపటికి విరేచనాలు, వాంతులు చేసుకుని అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు సమీపంలో చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. భూమయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

వీణవంక, మే 15: మండలంలోని కిష్టంపేట గ్రామనికి చెందిన బొద్దుల బాలయ్య(98) బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం 9 గంటలకు బాలయ్య ఇంటి నుంచి బహిర్భూమి కోసం వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతకగా ఇంటి దగ్గరలో గల అప్పాల శ్రీనివాస్ చెందిన బావి పక్కన చెప్పులు చేతి కర్ర కనపడ్డాయి. బావిలో వెతుకగా బాలయ్య మృతదేహం లభించింది. బాలయ్య మతిస్థిమితం బాగాలేదని, బహిర్భూమికి వెళ్లి వస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడని అతని మనువడు బొద్దుల రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

చిగురుమామిడి,మే 15: మండలంలోని బొమ్మనపల్లికి చెందిన బత్తుల వెంకటయ్య(43) ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు చేసుకున్నాడు. వెంకటయ్య కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు మొదల వడంతో జీవతంపై విరక్తి చెంది బుధవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెంకటయ్య భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బండి రాజేశ్ తెలిపారు.

కుక్కను తప్పించబోయి వ్యక్తికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 15: మండలంలోని గొల్లపల్లి బస్టాండు వద్ద కుక్కను తప్పించబోయి బైక్ కింద పడిన సంఘటనలో మండలంలోని బొప్పాపూర్‌కు చెందిన రాగి దేవేందర్ బుధవారం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. దేవేందర్ తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కుక్క అడ్డు రావడంతో తప్పించేందుకు యత్నించాడు. బైక్ అదుపు తప్పి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల టౌన్, మే 15: హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 5,000 జరిమాన విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ గ్రామంలో పెళ్లి భరత్‌లో డాన్స్ విషయంలో ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. గొడవను మనుసులో పెట్టుకుని ఓరుగంటి రాజు అనే వ్యక్తి 2020 సంవత్సరం డిసెంబరు 20న మరో వ్యక్తిని కత్తితో పొడిచి హత్యకు పాల్పడ్డాడు. మృతుని కుటుంబ సభ్యులు అదే రోజు మేడిపెల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి రాజుకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

ప్రహరీ విషయంలో వివాదం

● ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ ● గుంజపడుగులో పోలీసు పికెట్



పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

గొల్లపల్లి మే 15: గొల్లపల్లి మండలం గుంజపడుగు గ్రామంలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన చిన్న గొడవ చిలికి చిలికి గాలివానగా మారింది. చిన్న ప్రహరీ గోడ విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారి తీసింది. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. రెండు కుటుంబాల మధ్య చోటు చేసుకున్న ఘర్షణలో ఇరు వర్గాలకు చెందిన మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ కుమార్ తెలిపారు. ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన కళ్లెం తిరుపతి, పస్తం శారద ఇరు కుటుంబాల మధ్య ప్రహరీ ఉంది. గోడకు సంబంధించి కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఈ రెండు కుటుంబాల మధ్య మాట మాట పెరిగి తిరుపతి శారదను అసభ్యంగా దూషించడంతో ఘర్షణకు దారితీసింది. బాధిత మహిళ కుటుంబ సభ్యులు విషయం తెలుసుకొని తిరుపతి ఇంటి వద్దకు వెళ్లగా గొడవకు దారితీసి చివరికి ఒకరిపై ఒకరు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో తిరుపతికి సంబంధించిన ఇల్లును శారద కుటుంబ సభ్యులు పాక్షికంగా ధ్వంసం చేశారు. దీంతో కోపోద్రిక్తులైన తిరుపతి కుటుంబ సభ్యులు శారద అన్నదమ్ములైన సమ్మయ్య పోశయ్యపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డారు. కుటుంబ సభ్యులు స్థానికులు వైద్య చికిత్సల నిమిత్తం జగిత్యాల జిల్లా ప్రధాన ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ కుమార్ తన సిబ్బందితో కలిసి గ్రామాని సందర్శించి ఇరు వర్గాలతో మాట్లాడి గొడవను శాంతింపజేశారు. పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రామ నరసింహారెడ్డి, ఎస్ఐ సతీష్ కుమార్ పరిశీలించారు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి, తిరుమలేష్, శ్రీకాంత్, తోపాటు ఇరు వర్గాల చెందిన మరో ఏడుగురి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

ప్రధాని మోదీపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు

వేములవాడ టౌన్, మే 15: ప్రధాని నరేంద్ర మోదీ కమలం పువ్వు గుర్తు ధరించి రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని కరీంనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ నెల 8వ తేదీన వేములవాడ రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ బీజేపీ ఎన్నికల గుర్తు కమలం పువ్వు గుర్తుతో రాజన్నను దర్శించుకున్నారని ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై వేములవాడ సహాయ రిటర్నింగ్ అధికారి రాజేశ్వర్‌తో మాట్లాడగా తమకు వాట్సప్ ద్వారా వచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. విచారణ చేపట్టిన తర్వాత పూర్తి విషయాలు వివరిస్తామని ఆయన తెలిపారు.

కన్న కూతురిపై తండ్రి అత్యాచారం

నిందితుడికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష

రూ. 1,000 జరిమానా, బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం

జగిత్యాల టౌన్, మే 15: కన్నకూతురిపై తండ్రి అత్యాచారం చేసిన కేసులో 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు బాధిత బాలికకు రూ. 3 లక్షల పరిహారం ఇవ్వాలంటూ జిల్లా ప్రధాన న్యాయాధికారి నీలిమ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. మొదటి భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిపై గతంలో కేసు ఉంది. అనంతరం వేరే మహిళను వివాహం చేసుకోగా కూతురు జన్మించింది.

2022 సంవత్సరం అక్టోబరు 14న రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో కన్న కూతురు (మైనర్)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే భార్యతో పాటు బాలికను పెట్రోల్ పోసి చంపివేస్తానని బెదిరించాడు. భయభ్రాంతులకు గురైన తల్లి తన బాలికతో కలిసి నాలుగు రోజుల అనంతరం నిందితుడి మొదటి భార్య కుమారుడికి జరిగిన దారుణాన్ని వివరించింది.

దీంతో బాలిక సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం కింద కోరుట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు పోలీసులు సరైన సాక్ష్యలను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లిఖార్జున్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి 25 ఏళ్ల కఠిన కారాగార జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ముద్దాయికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీసుల అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

మూడు రోజుల పాటు డడ్జ్‌బాల్ పోటీలు

యైటింక్లయిన్‌కాలనీ, మే 15: ఇండియన్ డడ్జ్ బాల్ ఫెడరేషన్ కప్-2024 జాతీయ పోటీలు ఈనెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ డడ్జ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ప్రెస్‌భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్థానిక అబ్దుల్‌కలాం స్టేడియంలో జరిగే పోటీలకు దేశంలోని 12 రాష్ట్రాల నుంచి 20 జట్లు పాల్గొననున్నాయని, 120 మంది పురుషులు, 120 మంది మహిళలు పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసి ఆగస్ట్‌లో ఆస్ట్రేలియాలో జరగనున్న వరల్డ్ డడ్జ్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు పంపనున్నట్టు పేర్కొన్నారు. కాలనీ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో అనిల్‌కుమార్, పాశం శ్రీనివాస్, ఓదేలు యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు దిమ్మతిరిగే ఫలితాలు

ఎంపీ బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మే 15: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు దిమ్మతిరిగే ఎన్నికల ఫలితాలు రాబోతున్నాయని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని వి కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్‌కు లోక్‌సభ ఫలితాలు షాక్ ఇవ్వబోతున్నాయన్నారు. దేశమంతా నరేంద్రమోదీ హవా కొనసాగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ అత్యధిక స్థానాల్లో గెలువడం ఖాయమన్నారు. ఎన్నికల్లో బీజేపీ కోసం కష్టపడ్డ కార్యకర్తలు, నాయకులందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, మహబూబాబాద్, నల్లగొండ, పెద్దపల్లి నుంచి ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేసిన ఆరూరి రమేష్, సీతారాం నాయక్, సైదిరెడ్డి, గోమాసె శ్రీనివాస్, బీజేపీ ఎమ్మెల్యేలు పాయల శంకర్, ధన్‌పాల్ సూర్యానారాయణ, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జి మనో హర్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణిరుద్రమాదేవి, జనవాడ సంగప్ప పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలి

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట, మే 15: రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని కేవీకే ప్రధాన శాస్త్ర వేత్త వెంకటేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో స్వర్ణోత్సవాలు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ వాతవర ణంలో మార్పుల కారణంగా వ్యవసాయంలో వచ్చే మార్పులు గమనించి, వాటికి అనుగుణంగా చేపట్టాల్సిన విధానాలు వివరించారు. రాబోయే కాలంలో మనం నేలను రక్షించకపోతే మనం భావితరాలకి అందించడానికి ఏం మిగలదని గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటి నుంచిప్రకృతి సేద్యం వైపు దృష్టి సారించా లన్నారు. నీటిని, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ విభాగాల శాస్త్ర వేత్తలు సేద్య, ఉద్యాన, చేపల చెరువుల అభి వృద్ధి, చీడ పీడల నివారణ, గృహ విజ్ఞాన విషయాలపై చర్చించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో రైతులు, విద్యా ర్థులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

కారు బైక్ ఢీ... ఒకరికి గాయాలు

చందుర్తి, మే 15: చందుర్తి మండలం మల్యాల గ్రామంలో కారు బైక్ ఢీకొన్న సంఘటనలో ఓ యువ కుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రా మానికి చెందిన ఎల్లా రమేష్ అనే వ్యక్తి బైక్‌పై వెళ తుండగా బస్టాండ్ సమీపంలో కారు ఢీకొనడంతో రమేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు.

తాడికల్‌లో రోడ్డు ప్రమాదం

● డీజిల్ ట్యాంకర్ బోల్తా.. ఒకరు మృతి ● పలువురికి గాయాలు





ప్రమాదంలో గాయపడిన మహిళలు

శంకరపట్నం, మే 15: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో కరీంనగర్- వరంగల్ జాతీయ రహదారిపై బుధవారం డీజిల్ ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, పలువురికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి నిర్మాణం పనులు చేస్తున్న సంస్థకు సంబంధించిన డీజిల్ ట్యాంకర్ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ కేశవపట్నం వైపు నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్నాడు. డీజిల్ ట్యాంకర్ తాడికల్ గ్రామ పంచాయతీ ఎదురుగా అదుపు తప్పి రోడ్డు పక్క న నిల్చున్న వారి మీదకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ఘటనలో పూదరి శ్రీనివాస్ (39) అక్కడికక్కడే మృతి చెందగా, వెంగళ కనకమ్మ, ఆడెపు మౌనిక, చాగంటి ప్రకాష్, మంద రాజమ్మ, తాడిచర్ల సంపత్, ఉప్పరి మధురమ్మ, ఆడెపు లాస్య గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్ సీఐ వెంకట్, కేశవపట్నం ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రు లను కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతి చెందిన పూదరి శ్రీనివాస్‌ను హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ భార్య పూదరి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పాకాల లక్ష్మారెడ్డి తెలిపారు.





మృతుడు పూదరి శ్రీనివాస్ (ఫైల్)



బోల్తా పడిన డీజిల్ ట్యాంకర్

ఉచితంగా పులిహోర, మజ్జిగ పంపిణీ

కళ్యాణ్‌నగర్, మే 15: వాసవి క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖని లక్ష్మీనగర్‌లో పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిల్లల వైద్య నిపుణులు క్యాన శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీరేశం, సాగి అనీల్‌రావు, రాపెల్లి సుధాకర్, నందం పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల వితరణ

రామగిరి, మే 15: మండలంలోని సెంటినరీకాలనీలో వారంత సంతలో శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్టు అధికారి నూక రమేశ్ వ్యాపార సంస్థల యాజమానులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గంధి శ్రీనివాస్, మేకల మారుతి, వెంకటేష్, సమ్మయ్య, రహీం, వినయ్ పాల్గొన్నారు.

ఎంఐఎం నేతలపై కేసు నమోదు చేయాలి

రామగిరి, మే 15: బ్రాహ్మణ మహిళ అని చూడకుండా ఎంఐఎం నేతలు అసభ్యకరంగా మాట్లాడడంపై పోలీసులు కేసు నమోదు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మోల్మారి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నిక సందర్భంగా పాతబస్తీలో ఎంఐఎం నేతలు మాధవిలతను అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ దూషించడాన్ని ఖండించారు.

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలి

పాలకుర్తి, మే 15: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో బుధవారం తమకు న్యాయం చేయాలంటూ లారీ ప్రమాద మృతుడి కుటుంబ సభ్యులు టిప్పర్ లారీలను అడ్డుకున్నారు. ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన కోడిపుంజుల రాజు అనే లారీడ్రైవర్ మూడు సంవత్సరాల క్రితం కేశోరాం కంపెనీలోని ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ గోపు ఐలయ్యకు చెందిన టిప్పర్ లారీ ప్రమాదంలో మృతిచెందాడు. అప్పుడు అందరి సమక్షంలో మృతుడి కుటుంబానికి 18లక్షలు నష్టపరిహారం చెల్లించేందుకు ఐలయ్య ఒప్పందం కుదుర్చుకున్నాడని, ఇప్పటివరకు నష్టపరిహారం చెల్లించకపోవడంతో ఆందోళనకు దిగామని తెలిపారు. కార్యక్రమంలో పర్మినెంటు కార్మిక సంఘం నాయకులు బయ్యపు మనోహర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి దాడి మహేష్ యాదవ్, ముక్కెర శ్రీనివాస్, పర్వవేణి శ్రీనివాస్, అనవేణి నగేష్, ఒడ్నాల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఓడేడు-జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలి

కాల్వశ్రీరాంపూర్, మే 15: ఓడేడు - జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు. గత కొన్ని సంవత్సరాలు మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంథని నుంచి జమ్మికుంట వరకు, జమ్మికుంట నుంచి ఓడేడు వరకు ప్రతిరోజు రెండు ట్రిప్పులు నడిచేది. ఉదయం ఓడేడు నుంచి 4.3గంటలకు బస్సు బయలుదేరి ముత్తారం, పారుపల్లి, ఇదిలాపూర్, జాఫర్‌ఖాన్‌పేట్, మంగపేట, కునారం, గంగారం, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలం పలు గ్రామాల నుంచి జమ్మికుంట వరకు బస్సు నడవడం వలన ఉదయం పనుల నిమిత్తం హన్మకొండకు వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు ఉపయోగకరంగా ఉండేది. ఈ బస్సు నడవడం వలన ప్రయాణికులు ఉదయం హనుమకొండకు వెళ్లి పనులు ముగించుకొని తిరిగి జమ్మికుంటకు వచ్చేవరకు సాయంత్రం 6.30 గంటలకు ఈ బస్సు ఉండేది. ఈ బస్సు నడవడం వలన ప్రయాణికులకు, హన్మకొండకు ఆసుపత్రికి వెళ్లే వారికి ఉపయోగకరంగా ఉండేది. కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాలలోని ఆయాగ్రామాల నుంచి పైచదువుల కోసం విద్యార్థులు ప్రతిరోజు జమ్మికుంటకు వెళ్లి వస్తుంటారు. గతంలో ఈబస్సు నడవడం వలన విద్యార్థులకు కూడా ఉపయోగకరంగా ఉండేది. కాల్వశ్రీరాంపూర్ మండల ప్రజలు హన్మకొండకు, జమ్మికుంటకు వెళ్లాలన్న ప్రస్తుతం కొలనూరు, ఓదెల రైల్వే స్టేషన్లకు వెళ్లి భాగ్యనగర్ ఎక్కవలసిన పరిస్థితి ఏర్పడిందని ప్రయాణికులు తెలిపారు. ఈ భాగ్యనగర్‌కు వెళ్లేందుకు కూడా బస్సులు లేని కారణంగా ప్రైవేటు వాహనాల ద్వారా వెళ్లవలసి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. అప్పుడప్పుడు సమయానికి ప్రైవేటు వాహనాలు లేకుంటే భాగ్యనగర్ ట్రైన్ కూడా అందక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఓడేడు నుంచి జమ్మికుంటకు వెళ్లే బస్సు మండల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేది. కొన్ని నెలలుగా మంథని ఆర్టీసీ డిపో అధికారులు బస్సును నిలిపివేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత ఆర్‌టీసీ అధికారులు స్పందించి ఓడేడు-జమ్మికుంట బస్సును పునరుద్ధరించాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్మిషన్ల కోసం ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల ప్రచారం

కోల్‌సిటీటౌన్, మే 15: గోదావరిఖని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు అడ్మిషన్ల కోసం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ కళాశాల్లోని సౌకర్యాలు, ప్రగతి ఫలాలను తెలియజేస్తున్నారు. వారం రోజుల క్రితం ఉమ్మడి రామగుండం మండలంలోని అంతర్గాం, పాలకుర్తి మండలాలలోని గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఫలితాల్లో ప్రత్యేక స్థానం ఉందని, ఇటు ఫలితాల్లో అటు సౌకర్యాల్లో కూడా నెంబర్ వన్‌లోనే ఉందని కళాశాల ప్రిన్సిపాల్ కటకం అంజయ్య ఆధ్వర్యంలో అధ్యాపకుల కరపత్రాలను పంచుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో చేరడంవల్ల కలిగే ప్రయోజనాలు, నదుపాయాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. బుధవారం పాలకుర్తి మండలంలోని రాజీవ్‌తండా, బసంత్‌నగర్, జీడీనగర్, పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి, మల్యాలపల్లి గ్రామాలలో అధ్యాపకులు విద్యార్థులను కలిసి ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలు పొందాలని కోరారు. అధ్యాపకులు శంకర్, రామకృష్ణ, ధనలక్ష్మి, సుమలత పాల్గొన్నారు.

ఆసుపత్రి అప్‌గ్రేడ్ అయినా సేవలు అంతంతే..

- పూర్తిస్థాయిలో విధులకు హాజరుకాని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు - ఇబ్బంది పడుతున్న రోగులు


గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

కళ్యాణ్‌నగర్, మే 15: సింగరేణి మెడికల్ కళాశాల ఏర్పడిన తరువాత వైద్య సేవలు మెరుగవుతాయని ఆశపడ్డా ఇంకా పూర్తిస్థాయిలో రోగులకు వైద్య సేవలు అందడం లేదు. గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయినా సేవల్లో మాత్రం శూన్యంగా కనిపిస్తున్నది. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రోజు రాకుండా చుట్టపు చూపుగా వచ్చిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చాలా మంది హైదరాబాద్ నుంచి వచ్చిపోతున్నారు. రెండు రోజులు మాత్రమే విధులు నిర్వహిస్తూ వేతనాలు తీసుకుంటున్నారు. దీంతో ఆపరేషన్లు కానీ, ఇతర సేవలు కూడా ముందుకు సాగడం లేదు. గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకు వెయ్యి నుంచి 1200 మంది రోగులు వివిధ వైద్య చికిత్స కోసం వస్తున్నారు. ప్రొఫెసర్లు, అసిస్టెంట్‌ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు ఉన్నప్పటికీ వారు పూర్తిస్థాయిలో పని చేయడం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల వరకే ఓపీ చూస్తున్నారు. ఆదివారాలు, సెలవు దినాల్లో డ్యూటీ డాక్టర్లు కూడా ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 12మంది ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 44మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు. వీరు మెడికల్ కళాశాలలో క్లాసులు బోధించిన అనంతరం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. కానీ వారు సమయానికి రావడం లేదు. వైద్యులు సమయానికి రాక ఆపరేషన్లు వాయిదా పడాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఇన్‌పేషెంట్లకు ఎమర్జెన్సీ ఆపరేషన్లను కూడా కొన్ని కొన్ని సందర్భాల్లో వాయిదా వేయాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతో రోగి అపస్మారక స్థితిలో చేరుకునే పరిస్థితి ఏర్పడుతుంది.

ఎవరు ఎక్కడ పని చేస్తున్నారో..

362 పడకలుగా విస్తరించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎవరెక్కడ పని చేస్తున్నారనే సమాచారం కూడా ఆర్ఎంఓలకు ఉండడంలేదు. రోజువారీగా రిజిష్టర్లు, విధుల రోస్టర్లను పరిశీలించాల్సిన ఆర్ఎంఓలు వాటిపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. బయోమెట్రిక్ ఉన్నా చాలా మంది వాటిని ఉపయోగించడం లేదు. విధులకు రాకున్నా రిజిష్టర్‌లో సంతకాలు పెడుతూ వెళ్లిపోతున్నారు. కొంతమంది వైద్యులు సొంత ఆసుపత్రులపైనే మొగ్గు చూపుతూ 12గంటలు కాగానే వెళ్లిపోతున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉండగా 12గంటలకే వెళ్లిపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిబ్బంది చాలా వరకు పెరిగారు. పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులు కూడా పని చేస్తున్నారు. వీరు ఎంతమంది విధులకు హాజరవుతున్నారనే స్పష్టమైన లెక్కలు కూడా లేవు. అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న వారు ఎంతమంది, పర్మినెంట్ స్టాఫ్ ఎంతమంది అనే లెక్కలు కూడా పైఅధికారులకు తెలియకపోవడం గమనార్హం.

సొంత క్లీనిక్‌లకే ప్రాధాన్యం..

ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులను నడపవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ చాలా మంది సొంత క్లీనిక్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అంతేకాకుండా ఆసుపత్రికి వచ్చే రోగులకు కౌన్సెలింగ్ చేస్తూ తమ ఆసుపత్రికి వస్తే మెరుగైన వైద్యం చేస్తామంటూ వారి ఆసుపత్రికి రప్పిస్తున్నారు. అవసరం లేని టెస్టుల పేరుతో రోగుల వద్ద నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో ఓ వైద్యుడు ఓ రోగిని సొంతఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయడం వివాదం రేపింది.

భర్తీకాని పోస్టులు..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో 45మంది ప్రొఫెసర్ పోస్టులు ఉండగా 12మంది మాత్రమే పనిచేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 45మందికి ముగ్గురు మాత్రమే పని చేస్తున్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 142 మందికి 44మంది, ల్యాబ్‌టెక్నీషియన్లు 55మందికి ఒకరు, ఫార్మాసిస్టులు 12మందికి ఇద్దరు మాత్రమే పనిచేస్తున్నారు. ఇటీవల 12మంది వైద్యులను రిక్రూట్‌మెంట్ చేసుకున్నారు. ప్రభుత్వపరంగా మంజూరైన పోస్టులపై చాలా మంది వైద్యులు ఇక్కడికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. ఇటీవల కాలంలో 74పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన వైద్యుల రిక్రూట్‌మెంట్‌కు పిలిచినప్పటికీ కూడా పెద్దగా స్పందన కనిపించలేదు. పూర్తిస్థాయిలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, రెసిడెంట్ డాక్టర్లు, అసోసియేట్ వైద్యులు అందుబాటులో ఉంటే ప్రజలకు మరింత వైద్య సేవలు అందే అవకాశం ఉంటుంది.

ఇప్పటికైనా గాడితప్పిన పాలనను మెరుగుపర్చాలని రోగులు కోరుతున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గీట్ల జయంతి


గీట్ల చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అభిమానులు


ఎలిగేడులో దుస్తులు పంపిణీ చేస్తున్న నాయకులు

పెద్దపల్లిటౌన్, మే 15: మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి జన్మదిన పురస్కరించుకొని బుధవారం ఆయన అభిమానులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కునారం రోడ్డులో ఉన్న గీట్ల విగ్రహం వద్ద కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణి చేశారు. ఆయన చిత్రపటానికి, విగ్రహానికి పూలమాలలు వేశారు. గీట్ల అభిమానులు మాట్లాడుతూ, గీట్లను పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు ఎన్నడు మరిచిపోరని ఆయన చేసిన అభివృద్ధి కలకాలం నిలిచి ఉంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దండ నరసింహారెడ్డి, కుంభం సంతోష్ కుమార్, పైడా రవి, అమలాపురపు ఆనంద్,కొండి సతీష్, బండి సతీష్, కడార్ల శ్రీనివాస్, పెద్ది వెంకటేష్,బండారి సునీల్‌గౌడ్, ఎండి తాజ్, గుమ్మడి ప్రసాద్, చిట్టేటి సాయినాథ్ రెడ్డి, కనుకుంట్ల సదానందం, కాగితం శ్రీనివాస్, తిరుమలేష్, మల్లెత్తుల లక్ష్మణ్ యాదవ్, వెంకన్న, కుంభం మహేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎలిగేడులో..

ఎలిగేడు, మే 15: మండలంలోని అంబేద్కర్ చౌక్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎలిగేడు, నారాయణపల్లి పంచాయతీ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయన అభిమానులు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి జరిగిందంటే అది ముకుందరెడ్డి హయాంలోనే జరిగిందని, ఆయన లేనిలోటు స్పష్టంగా కనబడుతుందన్నారు. ఆయన ఆశయసాధన కోసం కృషి చేస్తామని వారన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మడ్లపల్లి భారతిఅంజయ్య, బాసంపల్లి కొండయ్య, సింగిల్ విండో మాజీ ఛైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గుడుగుల మహేందర్, మాజీ సింగిల్‌విండో డైరెక్టర్ రంగు శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యులు మామిడాల రమేష్, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కవ్వంపల్లి నారాయణ, తాటిపల్లి సతీష్‌బాబు, నాయకులు అమ్ముల శ్రీనివాస్, కవ్వంపల్లి కొండయ్య, శ్రీనివాస్, సంపత్, రాజిరెడ్డి, మండల యూత్ నాయకులు కప్పల ప్రవీణ్, గీట్ల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కళ తప్పుతున్న పల్లెప్రకృతి వనాలు

- ఎండిపోతున్న మొక్కలు - పట్టించుకోని అధికారులు


ఖమ్మంపల్లిలోని పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

ముత్తారం, మే 15: గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు కళ తప్పుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో పచ్చగా ఉండాల్సిన మొక్కలు ఎండిపోతున్నాయి. గ్రామీణులకు ఆహ్లాదం పంచేందుకు గత ప్రభుత్వం పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. రోజురోజుకూ తీవ్రమవుతున్న ఎండల దాటికి మొక్కలు నేలచూపులు చూస్తున్నాయి. ట్యాంకర్ల ద్వారానైనా నీరు అందించాల్సి ఉండగా, పట్టించుకునే వారు లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయనే విమర్శలు వస్తున్నాయి.

మండలంలో దాదాపు అన్ని గ్రామపంచాయతీల పరిధిలో పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఉపాధిహామీ ద్వారా ఒక్కోదానికి రూ.6 లక్షలు వెచ్చించారు. కొన్ని చోట్ల పల్లెకృత్రి వనాల చుట్టూ కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో పశువులు, గొర్రెలు, మేకలు లోపలికి ప్రవేశించి మొక్కలు, చెట్లను తినేస్తున్నాయి. మిగిలి ఉన్న మొక్కలకు కూడా సరిపడా నీరు అందించకపోవడంతో ఎండిపోతున్నాయి. కాగా, పల్లెప్రకృతి వనాలను గ్రామపంచాయతీ సిబ్బంది పర్యవేక్షించాల్సి ఉంది. ఇటీవల పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. వారి పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు పల్లెప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా వారు కూడా చేతులెత్తేశారు. దీంతో మొక్కలు, చెట్లు ఎండిపోయి కర్రలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పల్లెప్రకృతి వనాల సంరక్షణకు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నేత్రదానంపై అవగాహన పెంపొందించుకోవాలి


కాత్యాయిని కుటుంబీకులకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సభ్యులు

వైటింక్లయిన్‌కాలనీ, మే 15: నేత్ర, అవయవదానాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెపొందించుకోవాల్సిన అవసరం ఉన్నదని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి అన్నారు. కాలనీకి చెందిన ఆడెపు కాత్యాయిని ఇటీవల మృతి చెందింది. సదాశయ ఫౌండేషన్ సభ్యులు నేత్రదానంపై అవగాహన కల్పించడంతో కాత్యాయిని నేత్రాలను దానం చేయడానికి ఆమె కుటుంబీకులు అంగీకరించారు. బుధవారం కావ్య సంస్మరణ సభలో ఆమె కుటుంబానికి ప్రశంసాపత్రాన్ని సదాశయ ఫౌండేషన్ సభ్యులు అందజేశారు. మరణా నంతరం నేత్రాలు, అవయ వాలు మట్టిలో వృధాగా కలిసిపోకుండా, దానం చేస్తే మరొకరి జీవితంలో వెలుగులు నింపిన వారమవుతామని అన్నారు. కన్నబిడ్డ ఆకాల మరణం చెందిన సామాజ హితాన్ని కాంక్షించి నేత్రదానం చేసిన కాత్యాయిని కుటుంబ సభ్యులు అభినందనీయులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సానా రామకృష్ణారెడ్డి, రాజిరెడ్డి, కవిత, అనంత రాములు, వాసు అభినందించారు.

ఆమె కళ్లు సజీవం..

కమాన్‌పూర్, మే 15 : మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన పెరటి అహల్యమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందగా.. ఆమె బంధువులు నేత్రదానం చేసి ఆమె కళ్లను సజీవం చేశారు. మృతురాలి కొడుకు పెరటి రాజిరెడ్డి కోడలు, కుటుంబ సభ్యులు విషాదఛాయంలో సైతం సమాజ హితం కోసం ముందుకు వచ్చి సదాశయ ఫౌండేషన్ లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ ద్వారా మృతురాలి నేత్రాలను టెక్నీషియన్ ఆరీఫ్ సహకారంతో సేకరించారు. కాగా నేత్రదాత కుటుంబాన్ని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రావన్‌కుమార్, జిల్లా మహిళ అధ్యక్షురాలు వెల్ది కవిత, లైన్స్ క్లబ్ కార్యదర్శి నల్లవెల్లి శంకర్‌లు మృతురాలి కుటుంబాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ కమాన్‌పూర్ అధ్యక్షులు సార రామకృష్ణారెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బోడవరపు లింగమూర్తి, గౌరవ సలహాదారు నూక రమేష్, మండలాధ్యక్షులు బొజ్జ నరసింహచారి, కన్వీనర్ రామ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీబీజీకేఎస్‌తో బీఆర్ఎస్‌కు సంబంధం లేదు


సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

రామగిరి, మే 15: సింగరేణి ట్రేడ్‌యూనియన్ టీబీజీకేఎస్ కమిటీకి బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని కార్మికులు, ప్రజలు గుర్తించాలని జడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బుధవారం స్థానికంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతంలో యూనియన్ నేతల అవినీతి అక్రమాల పుణ్యాన గోలేటి నుంచి సత్తుపల్లి వరకు ఓటమిపాలైందని ఆరోపించారు. టీబీజీకేఎస్ అధ్యక్ష,కార్యదర్శుల విషయంలో భవిష్యత్‌లో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందుస్తుగా కార్మిక వర్గానికి సమాచారం ఇస్తున్నట్లు తెలిపారు. సింగరేణిలో టీబీజీకేఎస్ యూనియన్ నేతలు సాధారణ ఎన్నికలు వచ్చాయంటే అమ్ముడుపోవడానికి సిద్ధంగా ఉంటారని విమర్శించారు. బీఆర్ఎస్ ముసుగులో మీ వద్దకు వచ్చినట్లయితే నమ్మవద్దని దాని ప్రభావం బీఆర్ఎస్ పార్టీకి అంటగట్టవద్దని కార్మికులు, ప్రజలను కోరారు. సాధారణ ఎన్నికల్లో కార్మికులు బీఆర్ఎస్ పార్టీకి దూరం అవడానికి సెంటినరీకాలనికి చెందిన యూనియన్ నాయకులే ప్రధాన కారణంగా చెప్పారు. వారి అవినీతికి బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి సంబంధం ఉండదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు శంకేషి రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారయణగౌడ్, నాయకులు జక్కు రాకేష్, మ్యాదరవేని కుమార్ యాదవ్, శ్రీశైలం, దర్శుల సంపత్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

జూలపల్లి, మే 15: జూలపల్లి మండలం వడుకాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు రవిక్‌సిద్ధి, ఆనందం, నల్ల వెంకటిరెడ్డి, వెంకటేశ్వర్లు, చారి, గీతాంజలి, శకుంతల, మదుసూదన్, కనుకయ్య, సురేష్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు వేల్పుల ఓదెలు, పెంట అజయ్, కన్నం ప్రసాద్, జుట్టు సతీష్, అబ్బుల్, రేచవేని సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్‌కు ఘన నివాళి

సుల్తానాబాద్, మే 15: సుల్తానాబాద్‌కు చెందిన ప్రముఖ రైస్ మిల్లర్, రాష్ట్ర స్థాయి నాయకులు కొమురవెల్లి వీరభద్రయ్య మృతి పట్ల రైస్ మిల్లర్ల సంఘం నాయకులు తమ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక రైస్ మిల్లర్ల సంఘం భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరభద్రయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా రాష్ట్ర నేతగా ఈ ప్రాంతంలో ఇండస్ట్రీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను సంఘం నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షులు పురుషోత్తం రావు, జిల్లా అధ్యక్షులు మోరపల్లి తిరుపతి రెడ్డి, విజయపాల్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, పల్లా వాసు, సముద్రాల దర్మేందర్, దండెశ్రీనివాస్, బొల్లం అశోక్, లక్ష్మణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న పట్నాలు


బీరన్న పట్నాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

జూలపల్లి, మే 15: జూలపల్లి మండలం చీమలపేట గ్రామంలో యాదవ కుర్మ కులస్తుల ఆధ్వర్యంలో బీరన్న పట్నాలను బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ బీరన్న పట్నాల వేడుకల్లో పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, మాజీ ఎమ్మెల్యే దాసరిమనోహర్‌రెడ్డిలు వేర్వేరుగా పాల్గొన్నారు. యాదవ కుర్మ కులస్తులతో కలిసి వారు బీరన్న స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. నియోజక వర్గంలోని ప్రజలందరిని ఆదరించాలని స్వామి వారిని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు తొంటి బుచ్చయ్య పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ పట్నాలు

సుల్తానాబాద్, మే 15: సుల్తానాబాద్ మండలంలోని ఐతరాజుపల్లి గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన రేణుక ఎల్లమ్మ తల్లి పట్నాల ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. తొగర్రాయి గ్రామంలో బీరన్న పట్నాలు నిర్వహించగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో జరిగిన ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ నాయకులు వేగోలం సదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల కుల పెద్దలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, మే15: కాల్వశ్రీరాంపూర్ మండలం ఇప్పలపల్లి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులచే పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. యువత పెడతోవ పట్టకుండా మంచి మార్గంలో నడవాలని సూచించారు. నేటి యువత 30సంవత్సరాలు నిండకుండానే యాక్సిడెంట్లలో, అనారోగ్యాలతో చాలామంది మరణిస్తున్నారని, తల్లిదండ్రులకు తీరని దుఃఖాన్ని మిగులుస్తున్నారని అన్నారు. నేటి యువత రేపటి దేశ భవిత అని యువతరం గ్రహించాలని, తల్లిదండ్రులు కన్న కలలు నిజం చేయాలని పాటల రూపంలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి కళాకారులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, కొంద్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేష్‌గౌడ్, బుర్ర శంకర్‌గౌడ్, సలేంద్ర రాజన్న, దీకొండ శ్రావణ్, జిన్న రమ, కన్నూరి రేణుక, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

కాల్వశ్రీరాంపూర్, మే 15: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ ఆంగ్ల మాధ్యమ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈర్ల సమ్మయ్య బుధవారం మండల కేంద్రంలోని గిరిజన చెంచు తెగకు చెందిన నిరుపేద కుటుంబాలకు పండ్లు పంపిణీ చేశారు. తన కుమారుడు ఈర్ల ఆదర్శ్‌తో కలిసి ఆయన 50 మందికి పండ్లు అందజేశారు.

పోలీసుల సమయస్ఫూర్తితో తప్పిన అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పెద్దపల్లిటౌన్, మే 13: పోలీసుల సమయస్ఫూర్తితో భారీ అగ్ని ప్రమాదం తప్పింది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న బంధం పల్లి గ్రామ సమీపంలో రాజీవ్ రహదారిపై బంధంపల్లికి చెందిన రైతు తన పొలంలో వరిగడ్డలకు నిప్పు పెట్టాడు. ఆ మంటలు క్రమీపిన పెరిగి బంధంపల్లి పెట్రోలు బంకు వరకు వ్యాపించాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ రామస్వామి గమనించి పెట్రోల్ బంకు వద్ద వ్యాపించిన మంటలను పోలీస్ సిబ్బంది శరత్, శ్రీకాంత్, డ్రైవర్ శ్రీనివాస్‌ల సహకారంతో ఆర్పి వేసి అనంతరం ఫైర్‌ఇంజన్‌కు సమాచారం అందించారు. సమయ స్ఫూర్తితో మంటలను ఆర్పిన పోలీస్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

'మట్టి అక్రమ తరలింపుపై చర్యలు తీసుకోవాలి'

కమాన్‌పూర్, మే 15 : జూలపల్లి గ్రామంలోని చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి తరలింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన నాయకుడు ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నాడన్నారు. గతంలో సదరు నాయకుడు మట్టి తవ్వకాలపై జడ్పీ చైర్మన్ పుట్ట మధుపై ఇష్టారీతిన ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంథని నియోజకవర్గంలో నాయకుల అండదండలతో పెద్దఎత్తున ఇసుక, మట్టి మాఫీ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అక్రమంగా ఇసుక, మట్టి తరలింపును అధికార యంత్రాంగం వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నీలం శ్రీనివాస్, గుర్రం లక్ష్మీమల్లు, మేకల సంపత్‌యాదవ్, రాజుకుమార్, తోట వీరయ్య, పొన్నాం రాజేశ్వరి తదితరులు ఉన్నారు.